క్లుప్తంగా

రేపు మధుమేహంపై అవగాహన సదస్సు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పెన్షనర్ల భవన్‌లో ఈనెల 27వ తేదీ మధుమేహం నివారణ, చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శివనాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వైద్యులు సురేంద్ర నెహ్రూ మధుమేహం గురించి వివరిస్తారన్నారు. అలాగే పెన్షనర్లు ఆహార నియమాలు, మందుల వినియోగంపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఏపీవీహెచ్‌ఏ సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పెన్షనర్లందరూ పాల్గొనాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 9703004302 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాదన సేవ


పూజలందుకున్న అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతం, నిమ్మ, వేప రసాలతో అభిషేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవ నిర్వహించారు. అమ్మవారికి వడి బియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాదన సేవ, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రేషన్‌డీలర్లకు ప్రచార బోర్డుల పంపిణీ


ప్రచార బోర్డును తీసుకెళ్తున్న రేషన్‌డీలర్

దొర్నిపాడు: ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద ఐదేళ్లపాటు ప్రతి నెలా ఉచితంగా కార్డుదారులకు బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తారు. ఈ విషయానికి సంబంధించిన ప్రచారబోర్డులను మంగళవారం రేషన్ డీలర్లకు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. అన్ని రేషన్‌షాపుల వద్ద తప్పని సరిగా బోర్డులు ప్రదర్శించాలని చెప్పారు. అలాగే పేదలు ఉచిత బియ్యంను సద్వినియోగం చేసుకోవాలని, బ్లాక్ మార్కెట్‌లో రేషన్ బియ్యాన్ని విక్రయించరాదన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ రాజీనామా

ఉయ్యాలవాడ : మండలంలో తుడుమలదిన్నె గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కొంకా మోహనరావు మంగళవారం రాజీనామా చేశారు. సోమవారం గ్రామ సర్పంచ్ షేక్ మాబూషరీఫ్, పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్ సంతకాలు ఫోర్జరీ చేసి ఉద్యోగం పొందినట్లు ఏపీఓకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విధుల నుంచి తప్పుకుంటున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకటించారు. రాజీనామాను ఆమోదం నిమిత్తం ఎంపీడీఓ రఘురాంకు పంపినట్లు ఏపీఓ వెల్లడించారు.

లక్ష్మీవేంకటేశ్వరునికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవ నగర్‌లోని రామాలయంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామికి శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో అష్టాదళ పాదపద్మారాదన సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం వేదపండితులు 108 బంగారు పుష్పాలతో అష్టోత్తర నామ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సూరయ్య, శ్రీనివాస్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

30న తైక్వాండో ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): కర్నూలు, నంద్యాల తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ ఉమ్మడి జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు జరుగుతాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్ మజీద్ మంగళవారం ఓ ప్రకటలో తెలిపారు. నంద్యాల మున్సిపల్ టౌన్‌హాల్‌లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9985157077 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం


మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్‌బాబు


గోస్పాడులో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

గోస్పాడు: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం గోస్పాడులోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇంటర్ స్థాయిలో కొంత మేరకు అవగాహన కలిగి నడుచుకోవాలన్నారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. చెడు అలవాట్లకు బానిసైతే జీవితం అంధకారం అవుతుందని తెలిపారు. సమాజంలో చెడ్డ పేరు వస్తుందన్నారు. విద్యార్థి దశలో ఉత్తమ ఫలితాలు సాధించి అత్యున్నత స్థాయి లక్ష్యాన్ని చేరుకోవడం వల్ల మంచి పేరుతో పాటు కీర్తి ప్రతిష్టలు వస్తాయన్నారు. అటు కుటుంబ సభ్యులకు, ఇటు సమాజంలో పది మందికి ఉపయోపడేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఖాజా హుసేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

ఆళ్లగడ్డ: మాదకద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తు అంధకారమవుతుందని ఆళ్లగడ్డ పట్టణ సీఐ రమేష్‌బాబు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం – అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ప్రజ్ఞా కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి సవాల్‌గా మారిన దురలవాటు యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాల్సిన వయస్సులో చాలా మంది మత్తుకు బానిసవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరాటానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నగీన, కళాశాల ప్రిన్సిపాల్ హేమలతారెడ్డి ఉన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

శిరివెళ్ల: వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఫణి రాజకుమారి ఆదేశించారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు జిల్లాలో డయేరియా పెరిగిపోతుందని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒక సారి వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలన్నారు. చేతి పంపులు, పైప్‌లైన్లను చెక్ చేయాలన్నారు. పైప్ లైన్లు లీక్ లేకుండా చూడాలన్నారు. ఒక వేళ ఉంటే యుద్ధ ప్రాతి పదికన మరమ్మత్తులు చేయాలన్నారు. వీధుల్లో, మురికి కాల్వలపై బ్లీచింగ్ పౌడర్ చల్లి, ఫాగింగ్ చేయాలన్నారు. విష జ్వరాలు ప్రబలిన వెంటనే ప్రజలను చైతన్య పరిచి వైద్యశాలలకు పంపాలని, ఆరోగ్యశాఖతో సమన్వయం కలిగి ఉండాలన్నారు. వచ్చే నెల నుంచి సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ కార్యక్రమం మొదలవుతుందన్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు త్వరలోనే జారీఅవుతాయన్నారు. కార్యక్రమంలో ఈఓ ఆర్డీ నాగేంద్ర పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ఉపాధ్యాయులకు శిక్షణ


హెచ్‌ఎంకు ప్రశంసా పత్రం అందజేస్తున్న డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు దర్గయ్య, పుల్లయ్య పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత అనే విషయాలపై 65మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం డీఈఓ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం, పరిశుభ్రత, విద్యా కార్యక్రమం పాఠశాలల్లో ఉపయోగకరంగా ఉండే విధంగా చూడాలన్నారు. జబ్బులను నివారించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పరిశుభ్రత పాటించాలని సూచించారు. నంద్యాల జిల్లాలో 68 స్కూళ్లలో డెటాల్ బెనిగా స్వస్థ్ ఇండియా సంస్థ నిర్వహించిందని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి పాల్గొన్నారు.

సాక్షిగణపతికి ప్రత్యేక పూజలు


సాక్షిగణపతి స్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై సంకటహర చవితిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు.

కుమారస్వామికి విశేష పూజలు


కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

రైతు బజార్లలో సౌకర్యాలపై దృష్టి


శ్రీనివాసనగర్ రైతు బజార్‌లో అధికారులకు సూచనలిస్తున్న జేసీ

నంద్యాల(సెంట్రల్): రైతులు పండించిన కూరగాయలు, ఇతర ఉత్పత్తులను బయట ప్రాంతాల్లో కాకుండా రైతు బజార్లలోనే విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా అగ్రిట్రేడింగ్ మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రహిమాన్, కమిషనర్ నిరంజన్‌రెడ్డితో కలిసి పట్టణంలోని శ్రీనివాస నగర్, టెక్కెలోని రైతు బజార్లను తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఎంతమంది వినియోగదారులు వస్తున్నారు? పండ్ల, కూరగాయల ధరలను విక్రేతలు, వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. రైతు బజార్లలో ఏర్పడిన గుంతలను చదును చేసి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. అవసరమైన వసతులు కల్పించి వినియోగదారులను ధరాఘాతం నుంచి కాపాడడంతో పాటు రైతులకు లాభం చేకూర్చేలా రైతు బజార్లను తయారు చేయాలని సూచించారు.

ప్రయాణం.. ప్రమాదకరం


వంతెనపై ప్రవహిస్తున్న వర్షపు నీటిలో ద్విచక్రవాహనదారుడి అవస్థలు

ఉయ్యాలవాడ : మండలంలోని భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె రహదారిలో ఇంజేడు, పెద్దయమ్మనూరు గ్రామాల మధ్య ఉన్న లోలెవెల్ వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. చిన్నపాటి వర్షానికి నీళ్లు వంతెన ఎక్కి ప్రవహిస్తున్నాయి. చుట్టుపక్కల పొలాలు ఉండటంతో రైతులు, వ్యవసాయ కూలీలు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో వారికి వంతెనపై ప్రయాణించాలంటే భయమవుతుంది. నీటి ప్రవాహానికి కొట్టుకొని పోయే ప్రమాదం ఉంది. ఇక ద్విచక్రవాహనదారులు, ఆటోలు ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి లోలెవెల్ వంతెన స్థానంలో హైలెవెల్ వంతెన నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బోయలపై దాడి చేసిన వారిని శిక్షించాలి


మాట్లాడుతున్న పులికొండన్న

నంద్యాల(అర్బన్): కొలిమిగుండ్ల మండలం అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన బోయ సుదర్శనం కుటుంబంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న కోరారు. దాడికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుదర్శనంను మంగళవారం ఎంవీఆర్‌పీఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన చిన్న సంఘటనను జీర్ణించుకోలేని గ్రామానికి చెందిన పెత్తందారులు బోయ కుటుంబంపై దాడి చేయడం దారుణమన్నారు. అధికారులు విచారణ జరిపి శిక్షించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, లయర్ సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

తప్పుడు కేసులతో ఆత్మస్థైర్యం దెబ్బతీయలేరు


కార్యకర్తలు, నాయకులతో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి

బొమ్మలసత్రం: టీడీపీ నాయకులు తప్పుడు కేసులు నమోదు చేయించి వైఎస్సార్‌సీపీ నాయకుల ఆత్మస్థైర్యం దెబ్బతీయలేరని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 29వ వార్డులోని సచివాలయంలో చైర్‌పర్సన్ మాబున్నిసాను దూషించి బెదిరింపులకు దిగడం అమానుషమన్నారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో టీడీపీ అధికారంలోకి రాగానే శిలాఫలకాలను ధ్వంసం చేస్తూ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయడం సరైంది కాదన్నారు. పోలీసులు ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని కోరారు. రానున్న రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి పార్టీ కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి


ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, ఎన్ఎస్ఎఫ్ నాయకులు మంగళవారం ఎంఈఓ బ్రహ్మంనాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు, నిరంజన్ మాట్లాడుతూ.. అధిక ఫీజులు వసూలు చేస్తూ పాఠశాలల్లోనే యూనిఫాం, విద్యాసామగ్రి అమ్ముతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎంఈఓ ఆయా పాఠశాలకు షోకాజ్ నోటీసులు పంపిస్తానని తెలిపారు.

మాన్యం భూముల కౌలు వేలం వాయిదా


ఈఓతో మాట్లాడుతున్న రైతులు

రుద్రవరం: మండల పరిధిలోని పేరూరు ఈశ్వర, రామంజనేయస్వామి మాన్యం భూముల కౌలు వేలం వాయిదా పడింది. దాదాపు 70 ఎకరాలు ఉన్న మాన్యం భూములను దక్కించుకునేందుకు మొత్తం 48 మంది రైతులు డిపాజిట్లు చెల్లించారు. మంగళవారం వేలం పాట నిర్వహిస్తుండగా గ్రామంలోని ఇరు వర్గాల వారు గొడవకు దిగారు. అక్కడే ఉన్న ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి రంగప్రవేశం చేసి ఇరువర్గాల వారికి సర్ది చెప్పి పంపించారు. చేసేదేమిలేక అధికారులు వేలం పాటను వాయిదా వేసి వెళ్లి పోయారు.

చాబోలులో అతిసారం తగ్గుముఖం

జూపాడుబంగ్లా: చాబోలు అతిసారం వ్యాధి తగ్గుముఖం పట్టింది. వ్యాధి ప్రబలి ఆరురోజులు కాగా మంగళవారం ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడంతో వైద్యులు, వైద్యసిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. గ్రామంలో అతిసారం వ్యాధి ప్రబలినప్పటి నుంచి వైద్యులు, వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి తగిన సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవసరమైన క్లోరిన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మినరల్ వాటర్‌ను సరఫరా చేస్తుండటంతో గ్రామంలో అతిసారం కేసులు తగ్గిపోయినట్లు హెల్త్‌సూపర్‌వైజర్ రాముడు, విజయలక్ష్మమ్మ తెలిపారు. మరో రెండు రోజులపాటు గ్రామంలో వైద్యశిబిరాన్ని నిర్వహించడంతోపాటు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది గ్రామస్తుల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తారని చెప్పారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు


శివశంకర్ విలాస్ హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

నంద్యాల(సిటీ): హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలు ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకట రాముడు అన్నారు. మంగళవారం పట్టణంలోని నాయుడు గారి కుండ బిర్యాని, రాజధాని రెస్టారెంట్, నూనేపల్లెలోని శివశంకర్ విలాస్ హోటళ్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హోటల్ నిర్వహణలో శుభ్రత పాటించాలన్నారు. ఆహార పదార్థాలను తయారు చేయడానికి నాణ్యమైన సరుకులను వినియోగించాలని తెలిపారు. పదార్థాల నిల్వ ఉంచేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హానికర రసాయనాలు, రంగులు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కొన్ని ఆహార పదార్థాలను పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. ఆయన వెంట ఫుడ్ సేఫ్టీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

విత్తనదుకాణాల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఆళ్లగడ్డ: పట్టణంలోని విత్తణ దుకాణాలను ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల ఏడీఏలు రామమోహన్‌రెడ్డి, సుధాకర్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని, అలాగే ప్రతి కొనుగోలుపై రసీదులు ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు. తనిఖీలో మండల వ్యవసాయాధికారి కిశోర్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ అధికారులు

ఆళ్లగడ్డ: వానాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరసింహులు అన్నారు. పట్టణ శివారులోని జగనన్న టౌన్ టిడ్కో ఇళ్లలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఏమాత్రం అస్వస్థత అనిపించినా దగ్గరలోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళ్లి చూపించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుడికి వీల్ చైర్ విరాళం


వీల్‌చైర్, మందులు అందిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

నంద్యాల టౌన్: పట్టణంలోని గిరినాథ్ సెంటర్‌కు చెందిన లక్ష్మీనారాయణ అనే వృద్ధుడికి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నెరవాటి హాస్పిటల్స్ వైద్యులు వినోద్ కుమార్, అరుణ రూ.10 వేల విలువైన కమోడ్ వీల్ చైర్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి మాట్లాడుతూ.. లక్ష్మీనారాయణ కొంత కాలం క్రితం ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితిలో ఉన్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వీల్‌చైర్‌ను అందించిన డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. వృద్ధుడికి ప్రతి నెలా రూ.2 వేలు విలువైన మందులను అందజేస్తామన్నారు. వైస్ చైర్మన్ మారుతి కుమార్, కోశాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా రేణుకాదేవి

నంద్యాల టౌన్: నంద్యాల ప్రభుత్వ వైద్య కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఏ.రేణుకాదేవిని నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు మెడికల్ కాలేజీలో మైక్రో బయాలజీ విభాగం హెచ్‌ఓడీగా, వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న రేణుకాదేవిని అడిషనల్ డీఎంఈగా పదోన్నతి కల్పించి నంద్యాల మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా నియమించారు. ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా అనాటమీ హెచ్‌ఓడీ డాక్టర్ జయమ్మ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై వినతి


కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల(సిటీ): మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. జీపీఎఫ్ నంబర్ లేని ఉపాధ్యాయులకు కూడా ప్రావిడెంట్ ఫండ్ వ్యక్తిగత ఖాతాలకు జమ చేసేలా చూడాలన్నారు. ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి శివయ్య, దస్తగిరి, గాలయ్య, నౌమన్ బాషా, షరీఫ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ లైన్‌మన్లకు కిట్లు పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ లైన్‌మన్లకు మంగళవారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు భవనాశి నాగమహేష్, కాల్వ విజయశేఖర్ మాట్లాడుతూ.. వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని లైన్‌మన్లకు ఉచితంగా టోపీలు, కటింగ్ ప్లేయర్, స్క్రూడ్రైవర్, టెస్టర్లతో కూడిన కిట్లను అందజేశామని తెలిపారు. విద్యుత్ ఉద్యోగులకు త్వరలో వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. ఏఈ సతీష్‌కుమార్, రామయ్య, కుమార్, శ్రీనివాసులు, విజయశేఖర్, నాగరాజు, రజినీకాంత్ పాల్గొన్నారు.

నేడు చాబోలు ఆలయ భూములకు వేలం

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం చాబోలు గ్రామంలోని వేణుగోపాల, నాగేశ్వరస్వామి ఆలయాలకు చెందిన భూములకు మూడేళ్ల కౌలు కోసం బుధవారం వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి స్వర్ణముఖి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేణుగోపాలస్వామి ఆలయానికి 28.86 ఎకరాల మెట్ట భూములు, నాగేశ్వరస్వామి ఆలయానికి 20 ఎకరాల మెట్ట భూములకు వేలం పాటలు జరుగుతాయని పేర్కొన్నారు. పాట దారులు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాల్సి ఉంటుందన్నారు. బకాయిలు ఉన్న వారు, దేవస్థానంపై దావాలు వేసిన వారు పాటలో పాల్గొనరాదని తెలిపారు.